

వెంటాడిన మృత్యువు

మోటార్ సైకిళ్లు ఢీకొనగా ఓ విద్యార్థి రోడ్డుపై పడిపోవడం.. అప్పుడే ఓ ట్రాక్టర్ అతని మీదుగా దూసుకెళ్లడంతో ఆ విద్యార్థి మృతి చెందాడు. -10లో



సిద్ధాంతానికి కట్టుబడిన మహనీయుడు అల్లూరి

నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.80	రూ.92
రెండోరకం	రూ.60	రూ.70

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 556 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

కొత్త బియ్యం కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్: అర్హత కలిగి, ఇప్పటి వరకు బియ్యం కార్డులేని కుటుంబాలు రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది. అలాగే ఇదివరకే కార్డు కలిగి కార్డు విభజన, కార్డులో సభ్యులను జోడించడం, సభ్యుల పేరును తొలగించడం, బియ్యం కార్డు సరెండర్, బియ్యంకార్డులో చిరునామా మార్పు, బియ్యం కార్డులో తప్పు ఆధార్ సీడింగ్ దిద్దుబాటు వంటి సేవలను బుధవారం నుండి గ్రామ, వార్డు సచివాలయాలలో సేవలను ప్రారంభించామని డీఎస్‌ఓ రఘురాం ఒక ప్రకటనలో తెలియజేశారు. అర్హత కలిగిన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

సౌమ్యనాథ స్వామి హుండీ ఆదాయం లెక్కింపు



హుండీలోని డబ్బును లెక్కిస్తున్న భక్తులు

నందలూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించగా రూ.2,64,921 వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీ ఆదాయాన్ని నెలరోజుల తర్వాత లెక్కించామని.. వచ్చిన మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి జనార్దన, భక్తులు పాల్గొన్నారు.

నేడు సుగవాసి అంత్యక్రియలు

రాయచోటి: రాజంపేట మాజీ ఎంపీ, రాయచోటి మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాయచోటిలో గురువారం ఉదయం 9 గంటల నుండి అంత్యక్రియల కార్యక్రమం నిర్వహించనున్నామని కలెక్టర్ బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్ల కోసం జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, ఇతర అధికారులకు సూచనలను చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సుగవాసి మృతి తీరనిలోటు

రాయచోటి టౌన్: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు , మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు మృతి చెందడం పార్టీకి తీరనిలోటని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం పాలకొండ్రాయుడు భౌతికకాయానికి మంత్రులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. వీరితోపాటు పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సుగవాసికి నివాళి అర్పించారు.



సుగవాసి భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రులు బీసీ జనార్ధన్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి

లైనింగ్ నత్తనడక

- ఆరు నెలల్లో పూర్తి చేయిస్తామని.. ఇప్పుడు సాగదీస్తున్నారు
- పనులు చేపట్టి నాలుగు నెలలైంది
- నిధుల విషయంలోనూ తిరకాసు
- లైనింగ్ పనులపై రేపు సీఎం చంద్రబాబు సమీక్ష



బి.కొత్తకోట వద్ద కాలువలో వదిలేసిన లైనింగ్ పనులు

మదనపల్లి: హంద్రీ–నీవా కాలువ లైనింగ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. చెర్లోపల్లె రిజర్వాయర్‌లో కృష్ణా జలాలను నింపగా గత ఏడాది డిసెంబర్ నుంచి అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు పుంగనూరు ఉప కాలువ ద్వారా తరలించాల్సి ఉండగా కాలువకు లైనింగ్ పనుల పేరుతో ప్రభుత్వం కరువు రైతులను నిండా ముంచేసింది. చుక్కనీరు అందకుండా చేసింది. నీళ్లు ఇవ్వకుండా లైనింగ్ పనుల గురించి గొప్పగా చెప్పిన ప్రభుత్వం ఇప్పుడా లైనింగ్ పనులు పూర్తి చేయించేందుకు చిత్తశుద్ధి చూపడం లేదు. ఈ పనులు చేపట్టే ముందు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నిధులు మిగిలాయని జీవోలో చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు రుణం అంటోంది. ఆర్థిక అంశాలకు సంబంధించి ప్రభుత్వానికే స్పష్టత లేదని తెలుస్తోంది.

ఆరు నెలల్లో పూర్తట..

అన్నమయ్య, చిత్తూరు జిల్లాల పరిధిలో పుంగనూరు ఉపకాలువ 75వ కిలోమీటర్ నుంచి 189 కిలోమీటర్ వరకు ఉన్న కాలువకు లైనింగ్ పనులు చేపట్టారు. మిగిలిన కొన్ని కిలోమీటర్ల కాలువ (చిత్తూరు జిల్లాలో) విస్తరణ, ఆపై ప్రారంభమయ్యే కుప్పం ఉప కాలువకు లైనింగ్ పనులు చేపట్టారు. జూన్ నాటికి ఈ పనులు పూర్తి చేయించి నీటిని అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే నాలుగు మాసాలు గడచినా ఇంతవరకు లైనింగ్ పనుల్లో కదలికలేదు. కాలువ పనుల విషయంలో సబ్ కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడంతో పనుల్లో వేగం లేదు. అన్నమయ్య జిల్లాలో 15 కిలోమీటర్లు, చిత్తూరు జిల్లాలో 4 కిలోమీటర్ల మేర మాత్రమే లైనింగ్ పనులు జరిగినట్లు అధికారిక లెక్క. నాలుగు నెలలైనా పనుల్లో పురోగతి లేకపోవడం 224 కిలోమీటర్ల పుంగనూరు ఉపకాలువ, 123 కిలోమీటర్ల కుప్పం ఉపకాలువ పనులు ఎప్పటికి పూర్తి చేస్తారన్నది ప్రశ్నార్థకం. జూన్‌తో గడువు ముగిసిపోతే మళ్లీ గడువు పొడిగించుకోవడం మామూలైపోతుంది. దీని ఫలితంగా కరువు రైతాంగానికి కృష్ణా జలాల తరలింపు కలలో మాటగానే మిగిలిపోతుంది.

అప్పుడలా..ఇప్పుడిలా..

పుంగనూరు ఉపకాలువకు చేపట్టిన లైనింగ్ పనులకు సంబంధించి 2024 డిసెంబర్ 24న జారీ చేసిన జీవోలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ కాలువ వెడల్పు పనుల కోసం మంజూరు చేసిన రూ.1,929 కోట్ల నిధులు మిగిలాయని, ఈ మిగులు నిధుల నుంచి రూ.480.22 కోట్లను లైనింగ్ పనులకు మంజూరు చేస్తున్నట్టు స్పష్టంగా పేర్కొంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో కాలువలో 800 క్యూసెక్కుల నీటి ప్రవాహంతో వెడల్పు పనులకు రూ.1,217 కోట్లతో కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకున్నప్పటికీ కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఈ పని రద్దు చేసిన ప్రభుత్వం లైనింగ్ పనులకు నిధుల విషయంలో చెప్పిన మాటలన్నీ తిరకాసే అని ఇప్పుడు ప్రభుత్వమే చెప్పేసింది. రూ.1,929 కోట్ల నుండి రూ.480 కోట్లు ఇస్తున్నట్టు చెప్పగా ఇందులో ఎంత పని జరిగింది పేర్కొనలేదు. ఈ నిధుల్లో మిగులు లేదా పొదుపు నిధులు ఎంత అన్నది చెప్పలేదు. రూ.1,929 కోట్లలో రూ.480 కోట్లు ఇచ్చినట్టయితే ఈ నిధులు పోగా మిగిలినవి ఏమి చేస్తారో కూడా జీవోలో పేర్కొనలేదు. ఇలా తప్పుడు తడకగా నిధులు మంజూరు జీవో ఇచ్చిన ప్రభుత్వం తాజా లైనింగ్ పనులకు నాబార్డు రుణం పల్లవి ఎత్తుకుంది.

సీఎం సమీక్ష..

పుంగనూరు ఉప కాలువ, కుప్పం కాలువ లైనింగ్ పనులపై సీఎం చంద్రబాబు శుక్రవారం ఉమ్మడి అనంతపురం జిల్లా ఉరవకొండలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు సమాచారం రావడంతో అధికారులు నివేదికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఉరవకొండలో కాలువ పనులను సీఎం పరిశీలించాక అక్కడే అధికారులతో సమీక్ష ఉంటుందని చెప్పడంతో అనంతపురం సీఈ నాగరాజు ప్రాజెక్టు ఉన్నతాధికారులతో గురువారం సమావేశం నిర్వహిస్తున్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి



విభిన్న ప్రతిభావంతులకు పరికరాలను అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్, జేసీ తదితరులు

రాయచోటి: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్ ఆవరణలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంలో చెన్నై యాక్సెస్ హెల్త్ కేర్ ఫ్రీడమ్ ట్రస్టు సహకారంతో 150 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ. 50 లక్షల విలువైన కృత్రిమ కాళ్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌లు విభిన్న ప్రతిభావంతుల కృత్రిమ కాళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ తోడ్పాటును అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాలన్నారు. జిల్లాలో 150 మంది కాళ్లు కోల్పోయిన విభిన్న ప్రతిభావంతులకు సంబంధించి ఈ ఏడాది మార్చి మొదటి వారంలో కృత్రిమ కాళ్ల కోసం కొలతలు తీసుకున్నామని.. వారందరికీ చెన్నైకి చెందిన యాక్సిస్ హెల్త్ కేర్ ఫ్రీడమ్ ట్రస్టు ఆర్థిక సహకారంతో ఆధునిక కృత్రిమ కాళ్లు అమర్చామన్నారు. తమ ట్రస్టు తరఫున ఇలాంటి సేవా కార్యక్రమాలలో భాగం కావడం గర్వంగా ఉందని చెన్నై యాక్సెస్ హెల్త్ ఫ్రీడమ్ ట్రస్టు ప్రతినిధి డాక్టర్ సుందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు ఆర్‌వి కృష్ణ కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్ విధానానికి స్పందన

- జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాస్

మదనపల్లె రూరల్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్లాట్ బుకింగ్ విధానానికి స్పందన కనిపిస్తోందని జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం వార్షిక తనిఖీలో భాగంగా మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ అవసరాల కోసం గంటల తరబడి ఎదురుచూసే విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికిందన్నారు. పబ్లిక్ డేటా ఎంట్రీ(పీడీఈ) సిస్టమ్ ద్వారా, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారిక వెబ్‌సైట్‌లోని స్లాట్ బుకింగ్ మాడ్యూల్ ద్వారా, అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉండే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చన్నారు. మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో పది నిమిషాలకు ఓ స్లాట్ బుకింగ్ అనుమతి ఉండగా, ప్రస్తుతం రెండుకు పెంచామన్నారు. ఒకరోజుకు 79 స్లాట్స్ వరకు ప్రజలు బుక్ చేసుకోవచ్చన్నారు. అన్నమయ్య జిల్లాలో ఆదాయంలో మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ గురుస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.




మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాస్

రేపు హార్సిలీహిల్స్‌కు ఒబెరాయ్ ఛైర్మన్ రాక

బి.కొత్తకోట: రాష్ట్ర పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, ఒబెరాయ్ హోటల్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అర్జున్ ఒబెరాయ్‌తో కలిసి మండలంలోని హార్సిలీహిల్స్‌పై శుక్రవారం పర్యటించనున్నారు. పర్యాటక రంగ అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ప్రఖ్యాత హోటల్స్ సంస్థ ఒబెరాయ్ సంస్థకు 20.93 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ భూమిలో సెవెన్‌స్టార్ హోటళ్ల నిర్మాణం, విల్లాలను నిర్మించి అతిథిరంగాన్ని అభివృద్ధి చేయాలని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయించి ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఈ నిర్ణయంపై విల్లాలను నిర్మించి 250 మందికిపైగా నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఒబెరాయ్ ముందుకొచ్చింది. తర్వాత గత ఏడాది ఆగష్టులో కలెక్టర్ శ్రీధర్, సంస్థ ప్రతినిధులు కొండపై కేటాయించిన భూమిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఇక్కడి వాతావరణం, పరిస్థితులు నచ్చడంతో నిర్మాణానికి తాము సిద్ధమే అన్న సంకేతాలను ఇచ్చారు. ప్రస్తుతం సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ వస్తుండటంతో నిర్మాణ పనులకు బీజంపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీరి పర్యటన కోసం రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



జయహో!

పహల్గాం ఉగ్రదాడి ఘటనకు ప్రతీకారంగా మంగళవారం అర్ధరాత్రి సాగిన 'ఆపరేష్ సింధూర్'పై నాయకులు, జిల్లావాసులు హర్షం వ్యక్తం చేశారు. పలుచోట్ల టపాసులు కాల్చారు. జయహో.. భారత్ నినాదాలతో హోరెత్తించారు. ఉగ్రవాదులను పూర్తిగా అంతమొందించేదాకా విశ్రమించవద్దని నినదించారు. ఆర్మీ ధైర్యసాహసాలకు సెల్యూట్ చేశారు. – సాక్షి, నెట్‌వర్క్...

ఇండియన్ ఆర్మీ సత్తాకు నిదర్శనం



'ఆపరేషన్ సింధూర్'తో ఇండియన్ ఆర్మీ సత్తా ప్రపంచ దేశాలకు తెలిసింది. జమ్ము–కాశ్మీర్‌లోని పహల్గాంలో టూరిజాన్ని దెబ్బ తీసేందుకు, భారతదేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు పాకిస్తాన్ ఉగ్రవాదులు అతి కిరాతకంగా పర్యాటకులను కాల్చి చంపడం దారుణం. ఉగ్రవాదులను ఏరిపారేయడానికి ప్రధాని నరేంద్రమోడీ ఆదేశాల మేరకు ఇండియన్ ఆర్మీ 'ఆపరేషన్ సింధూర్' బుధవారం తెల్లవారుజామున 25 నిముషాల వ్యవధిలోనే 9 ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. ఉగ్రమూకల పీచమణచడమే లక్ష్యంగా ఇండియన్ ఆర్మీ జరిపిన ఈ దాడిపై దేశం యావత్తు గర్విస్తోంది. ఉగ్రమూకల ఆటకట్టించడంలో ప్రధాని మోదీ తీసుకునే చర్యలకు ఇండియా అంతా ఒక్కటై మద్దతు తెలుపుతోంది. – వైఎస్ అవినాష్‌రెడ్డి, కడప పార్లమెంటు సభ్యులు

యావత్ భారతదేశం గర్విస్తోంది



ఇండియన్ ఆర్మీ సింధూర్ ఆపరేషన్‌ను దిగ్విజయంగా పూర్తి చేయడంతో యావత్ భారతదేశం గర్వపడుతోంది. ఉగ్రవాదులు పహల్గాంలో సృష్టించిన మారణహోమానికి ఇండియన్ ఆర్మీ ధీటైన సమాధానం చెప్పింది. పహల్గాం సంఘటన జరిగినప్పటి నుంచి భారతీయులందరూ ఉగ్రవాదంపై ఎంతో కసిగా ఉన్నారని, పహల్గాం సంఘటనకు ప్రతీకారంగా ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూ పెంచిపోషిస్తున్న పాకిస్తాన్‌కు ధీటుగా సమాధానం చెప్పాలని ప్రతి భారతీయుడు కోరుకుంటున్నాడు. భారతీయులందరు కోరుకున్న విధంగానే ఇండియన్ ఆర్మీ సింధూర్ ఆపరేషన్‌తో తగిన గుణపాఠం చెప్పడం ఎంతో ఆనందంగా ఉంది. ఆపద వస్తే భారతీయులంతా ఏకమవుతారనేందుకు పహల్గాం సంఘటన నిదర్శనంగా నిలిచింది. ఇండియన్ ఆర్మీ ఎంతో శక్తివంతమైనదని.. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. – ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే

గర్వించాల్సిన సమయమిది



ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం హర్షణీయం. పహల్గాంలో అమాయకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులపై దాడులు నిర్వహించి వారికి సరైన బుద్ధి చెప్పడం అభినందనీయం. భారతీయుడిగా ఉన్న ప్రతి ఒక్క వ్యక్తి గర్వించాల్సిన సమయమిది. ఏ సంస్థ అయినా ఉగ్రవాదాన్ని పెంచి పోషించి అమాయకుల జోలికి వస్తే ఇదేరకంగా బుద్ధి చెప్పాలి. దేశం కోసం పోరాడుతున్న ఇండియన్ ఆర్మీకి, మన సైన్యానికి అన్ని రకాలుగా తోడుగా, అండగా నిలుద్దాం. – గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పాకిస్తాన్‌కు వణుకు



భారత ప్రభుత్వం, దేశసైనికులు పెహల్గామ్ దాడులకు నిరసనగా ఉగ్ర వాదులపై చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయంతో పాక్‌లో వణుకు పుట్టింది. పెహల్గామ్‌లో దాడులు చేసిన ఉగ్రవాదులపై ప్రతీకారం తీర్చుకొన్న భారత సైనికులు సాధించిన విజయం ప్రతి యువకుడికి ఆదర్శం. 9 చోట్ల ఏక కాలంలో దాడులు చేసి 100 మందికిపైగా ఉగ్రవాదులను మట్టుపెట్టిన సైనికులకు కృతజ్ఞతలు. – కొరముట్ల శ్రీనివాసులు, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే

ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలి



ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ దేశానికే గర్వకారణం. పాక్ ఉగ్రవాద శిబిరాలపై దాడిని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం. కశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదులు టూరిస్టులపై జరిపిన దాడికి, అంతకుముందు పుల్వామాలో చేసిన దాడికి...దీటైన జవాబు ఇచ్చినందుకు భారత సైన్యానికి మనస్ఫూర్తిగా అభినందనలు. ప్రస్తుత సందర్భంలో పార్టీలకు అతీతంగా దేశం ఐక్యతను చాటాల్సిన అవసరం ఉంది. – నిసార్ అహ్మద్, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన భారీ వృక్షాలు
- అరటి, మామిడి రైతు కుదేలు



పెనగలూరు: గాలివానకు సాయిబాబా ఆలయం ఎదురుగా ఉన్న చింతచెట్టు నేల కూలిన దృశ్యం

పెనగలూరు/ఓబులవారిపల్లె: పెనగలూరు మండలంలో బుధవారం తెల్లవారుజామున గాలివాన బీభత్సం సృష్టించింది. 200 సంవత్సరాల కాలం నాటి చింతచెట్టు కూకటి వేళ్లతో సహా నేలకొరిగి రోడ్డుపై అడ్డంగా పడింది. దీంతో రాకపోకలు స్తంభించాయి. ఎన్‌ఆర్ పురం బస్సు రాజంపేటకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో అక్కడే నిలిచిపోయింది. అధికారులు చర్యలు తీసుకొని రాకపోకలు జరిగేందుకు రోడ్డుపై చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న 150 సంవత్సరాల కాలం నాటి చింతచెట్టు కూడా విరిగిపడింది. పెనగలూరు గ్రామానికి చెందిన జిలకర కృష్ణయ్యకు చెందిన రేకులు గాలికి ఎగిరి పడిపోయాయి. అలాగే సుబ్బరాయుడు మామిడి తోటలో దాదాపు నాలుగు టన్నుల మామిడి కాయలు రాలిపోవడంతోపాటు రెండు చెట్లు కిందపడ్డాయి. ఈ గాలి వానకు విద్యుత్ తీగలు తెగిపోవడంతో తెల్లవారుజాము నుండి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రామాలలో విద్యుత్ సరఫరా లేదు. అనంతరం విద్యుత్‌ను పునరుద్ధరించినట్లు ఏఈ రాజకుమార్ తెలిపారు.



ఓబులవారిపల్లె: చిన్నఓరంపాడు సమీపంలో నేలకొరిగిన అరటిచెట్లును చూపిస్తున్న రైతు

- ఓబులవారిపల్లె మండలంలో మంగళవారం రాత్రి వీచిన గాలి, కురిసిన వానకు అరటి, బొప్పాయి, ఆకు తోటలు నేలకొరిగాయి. బోటుమీదపల్లి, కాకర్లవారిపల్లి, రాళ్లచెరువుపల్లి, వైకోట, చిన్నఓరంపాడు తదితర గ్రామాలలో కోతకు వచ్చిన పండ్లతోటలు నేలకొరిగాయి. 200 మంది రైతులకు సంబంధించిన 100 ఎకరాల అరటి, 50 ఎకరాల తమలపాకు, 30 ఎకరాలు బొప్పాటి పంటలు దెబ్బతిన్నాయి. దీంతో దాదాపు మూడు కోట్ల రూపాయలు పంట నష్టం వాటిల్లింది. మండల ఉద్యానశాఖ అధికారి భాస్కర్ మాట్లాడుతూ నష్టపోయిన రైతుల వివరాలు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామన్నారు. గాలి వానకు కొర్లకుంట గ్రామంలో రేకుల షెడ్డు కూలిపోయింది.

మామిడి కాయలు నేలరాలాయి



బుధవారం తెల్లవారుజామున వీచిన గాలులు, కురిసిన వర్షానికి నాలుగు టన్నుల మామిడి కాయలు రాలిపోయాయి. రాలిపోయిన కాయలను కొనే వారు కరువయ్యారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. – సుబ్బరాయుడు, రైతు, పెనగలూరు

రోడ్లు జలమయం

పీలేరు రూరల్: పీలేరులో భారీ వర్షం కురవడంతో పట్టణమంతా జలమయమైంది. బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి 6.30 గంటల వరకు ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో ఆర్టీసీ బస్టాండ్, ఎల్‌బీఎస్ రోడ్డు, రైల్వే అండర్ బ్రిడ్జి తదితర ప్రాంతాలు వర్షపునీటితో నిండిపోయాయి. నెల రోజులకు పైగా సూర్యుడి తాపానికి ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు.



పీలేరు రూరల్ : రైల్వే అండర్‌బ్రిడ్జి కింద వర్షపునీరు

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో అసిస్టెంట్ లైన్‌మెన్ మృతి

కేవీపల్లె : విద్యుదాఘాతంతో అసిస్టెంట్ లైన్ మెన్ మృతి చెందిన సంఘటన మండలంలోని వగళ్లలో జరిగింది. బుధవారం విద్యుత్ లైను సరి చేసేందుకు వగళ్లకు చెందిన అసిస్టెంట్ లైన్‌మెన్ చంద్రయ్య (48) ఎల్‌సీ తీసుకుని విద్యుత్ స్తంభం ఎక్కాడు. అయితే పని పూర్తి చేసి విద్యుత్ స్తంభం దిగేశాడనే సమాచారంతో సబ్ స్టేషన్ సిబ్బంది విద్యుత్ సరఫరా ఇచ్చారు. దీంతో విద్యుదాఘాతంతో చంద్రయ్య మృతి చెందాడు.

శతాధిక వృద్ధురాలి మృతి



జి. వెంకటశిద్దమ్మ (ఫైల్)

కురబలకోట : మండలంలోని అంగళ్లు గ్రామం మొలకవారిపల్లెకు చెందిన శతాధిక వృద్ధురాలు జి. వెంకటశిద్దమ్మ మంగళవారం రాత్రి మృతి చెందారు. ఈమెకు నలుగురు సంతానం. జీవితాంతం ఈమె ఎలాంటి రోగాల బారిన పడలేదని కుటుంబీకులతో పాటు స్థానికులు తెలిపారు. రెండు రోజులుగా స్వల్ప అస్వస్థతకు గురైంది. వృద్ధాప్య సమస్యతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రమాదవశాత్తు వరిగడ్డి దగ్ధం



విద్యుత్ తీగలకు తగులుకుని దగ్ధమవుతున్న వరిగడ్డి

సుండుపల్లె : వరిగడ్డి లోడ్‌తో దుద్యాలకు వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగులుకొని నిప్పు అంటుకున్న సంఘటన బుధవారం జరిగింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌కు, వ్యక్తులకు ఎలాంటి అపాయం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ధ్రువపత్రాలు సిద్ధం చేసుకునేందుకు..

సమయం ఉంది మిత్రమా!

- విద్యా సంస్థల్లో చేరేందుకు కుల, ఆదాయ తదితర సర్టిఫికెట్లు తప్పనిసరి
- ముందస్తుగా సిద్ధం చేసుకోవడం మేలు



రాజంపేట టౌన్ : టెన్త్, ఇంటర్మీడియట్ తదితర పరీక్షల ఫలితాలు వెలువడ్డాయి. పై తరగతుల్లో ప్రవేశాలకు, వివిధ కోర్సుల్లో చేరేందుకు పలు ధ్రువపత్రాలు తప్పనిసరి. అందువల్ల విద్యార్థులు ముందస్తుగా వారికి కావాల్సిన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవడం ఎంతో మేలని ఉపాధ్యాయులు, అధ్యాపకులు సూచిస్తున్నారు.

సచివాలయాల ద్వారా సులువుగా ధ్రువపత్రాలు

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థతో అన్ని రకాల ధ్రువపత్రాలు సులువుగా పొందే అవకాశం లభించింది. సచివాలయాలు ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉన్నాయి. అందువల్ల విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న సచివాలయానికి వెళ్లి కావాల్సిన ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత గడువులోగా అధికారులు ధ్రువపత్రాలు మంజూరు చేస్తారు. ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, పాలిటెక్నిక్, ఎంబీఏ, ఎంసీఏ ఇతర పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షలకు దరఖాస్తు చేసుకునే సమయంలోనే ప్రధానంగా కుల, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల పై విద్యా కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునేవారు ముందుగానే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి ఉంటారు. అయితే నేరుగా అడ్మిషన్ పొందే ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ వంటి కోర్సుల్లో చేరేవారు ఈనెలలోనే అవసరమయ్యే ధ్రువపత్రాలను పొందివుంటే ఆందోళన చెందకుండా పై కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు వీలవుతుంది.

ఒత్తిడి పెరగకముందే..

సాధారణంగా మే, జూన్ నెలల్లో ముఖ్యంగా సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో సిబ్బందిపై ధ్రువపత్రాల జారీకి సంబంధించి అధిక ఒత్తిడి ఉంటుంది. ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న తరువాత వీఆర్‌ఓ, ఆర్ఐ క్షేత్రస్థాయిలో పరిశీలన, విచారణ చేయాల్సి ఉంటుంది. అందువల్ల దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో వస్తే ధ్రువపత్రాల జారీ కూడా ఆలస్యం అవుతుంది. అందువల్ల విద్యార్థులు తమకు కావాల్సిన ధ్రువపత్రాల కోసం ఇప్పటి నుంచే త్వరపడితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

ధ్రువపత్రాలు పొందాలంటే..

- ఒకటవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ వంటి కోర్సుల్లో ప్రవేశానికి
- పలువురు విద్యార్థులకు ప్రధానంగా కులం, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ,
- ఆదాయం వంటి ధ్రువపత్రాలు తప్పనిసరి. వీటికోసం సచివాలయాలు,
- మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- పై వాటిని పొందాలంటే ఆధార్, రేషన్‌కార్డు, విద్యార్హతకు సంబంధించిన
- అర్జీ పూర్తి చేసి అవసరమైన నకలును సచివాలయం డిజిటల్
- సహాయకుడికి అందజేయాల్సి ఉంటుంది.
- ఆన్‌లైన్‌లో పొందుపరిచిన వివరాలపై వీఆర్‌ఓ క్షేత్రస్థాయిలో
- విచారించి, అందుకు సంబంధించిన నివేదికను ఆర్ఐకి సమర్పిస్తారు.
- ఆర్ఐ పరిశీలించి అన్నీ పక్కాగా ఉంటే తహసీల్దార్ వద్దకు పంపిస్తారు.
- అప్పుడు తహసీల్దార్ తన లాగిన్‌లో నిశితంగా పరిశీలించి డిజిటల్
- సంతకంతో ధ్రువపత్రాన్ని మంజూరు చేస్తారు. అనంతరం
- దరఖాస్తుదారుడి మొబైల్‌కు వచ్చే మెసెజ్‌తో సచివాలయంలోకాని
- మీసేవా కేంద్రంలోకాని ధ్రువపత్రాలను పొందవచ్చు.

సెలవుల్లోనే పొందండి



విద్యా సంవత్సరం ఆరంభం కాకముందే విద్యార్థులు తమకు అవసరమైన ధ్రువపత్రాలను రెవెన్యూ అధికారుల నుంచి పొందాలి. సాధారణంగా రెవెన్యూ అధికారులకు పనిఒత్తిడి అధికంగా ఉంటుంది. అందువల్ల విద్యార్థులంతా విద్యా సంస్థలు ప్రారంభమయ్యాక కావాల్సిన ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటే రెవెన్యూ అధికారులపై మరింత పనిఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా నిర్ణీత సమయానికి విద్యార్థులకు ధ్రువపత్రాలు అందడం కొంతమేర కష్టం అవుతుంది. అందువల్ల విద్యార్థులు తమకు కావాల్సిన ధ్రువపత్రాలను సెలవుల్లోనే సిద్ధం చేసుకోవడం ఎంతో మంచిది.

జి.చక్రధర్‌రాజు, ఎంఈఓ, పుల్లంపేట

అలజడులు సృష్టించే మెసేజ్‌లు ఫార్వర్డ్ చేస్తే కఠిన చర్యలు

రాయచోటి : విద్వేషపూరితమైన సమాచారాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా షేర్ చేసినా, పోస్ట్ చేసినా, ఆడియో, వీడియో మెసేజ్‌ల రూపంలో గ్రూపుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించిన వారిపై చట్టప్రకారం కఠినదండనలు తప్పవని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హెచ్చరించారు. ప్రతి సామాజిక మాధ్యమాల గ్రూపులను ఎప్పటికప్పుడు సోషల్‌మీడియా పోలీసులు, సైబర్ సెల్ పోలీసులతో నిఘా ఉంచామని తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయొద్దన్నారు. ఏదైనా మెసేజ్ ఫార్వర్డ్ చేసే ముందు అది వాస్తవమైనదా కాదా అని నిర్ధారణ చేసుకున్న తర్వాత గ్రూపుల్లో షేర్ చేయాలన్నారు. అలా కాకుండా అలజడులు సృష్టించే మెసేజ్‌లను ఫార్వర్డ్ చేస్తే గ్రూప్ అడ్మిన్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎస్పీ తీవ్రంగా హెచ్చరించారు.

సిద్ధాంతానికి కట్టుబడిన మహనీయుడు అల్లూరి

జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన మహనీయుడు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన్యం ప్రజల దీన స్థితిగతులను గమనించి బ్రిటీష్ అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా విప్లవానికి సిద్ధం కావాలని మన్యం ప్రజలను పురిగొల్పారన్నారు. గంటందొర, మిగిలిన అనుచరుల సాయంతో బ్రిటీష్ అధికారులపై విప్లవానికి అల్లూరి తెరతీశారన్నారు. ఇలా మూడు స్టేషన్లపై దాడిచేసి భారీగా ఆయుధాలను సేకరించుకొని విప్లవం ప్రారంభించినట్లు తెలిపారు. గెరిల్లా యుద్ధ తంత్రకళను ఉపయోగించి బ్రిటీష్ సైన్యానికి ముచ్చెమటలు పట్టించిన మహా నాయకుడన్నారు. సీతారామరాజు కలలుగన్న స్వాతంత్ర్యం ఆయన ఆత్మ త్యాగం చేసిన 28 సంవత్సరాలకు లభించిందన్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అల్లూరి సీతారామరాజు జీవితం ఓ ప్రత్యేక అధ్యాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శంకరమల్లయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు పి.రాజారమేష్, కె.రాజారెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవరెడ్డి, రిజర్వు ఇన్‌స్పెక్టర్ ఎం.పెద్దయ్య, ఇతర పోలీసు అధికారులు, డీపీఓ సిబ్బంది, మహిళా పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌తో మేడా భేటీ



వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మేడా రఘునాథరెడ్డి

రాజంపేట : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి భేటీ అయ్యారు. బుధవారం తాడేపల్లిలో జగన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మేడా రఘునాథరెడ్డి ఇటీవల తిరుపతి పార్లమెంటరీ పరిశీలకునిగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మేడా రఘునాథరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

అడ్డుగోడ వ్యవహారంపై ఏఎస్పీ విచారణ



అడ్డుగోడ నిర్మాణంపై విచారణ చేస్తున్న ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే

రాజంపేట : పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో డీబీఎన్ పల్లె మాదిగపల్లెకు అడ్డుగోడ నిర్మించిన వ్యవహారంపై రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే బుధవారం సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. సబ్‌కలెక్టర్ ఆదేశాల ఈ విచారణ ప్రక్రియను చేపట్టారు. మాదిగపల్లె వాసుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. తమ పల్లె చుట్టూ ఎత్తయిన గోడలు నిర్మించి సామాజిక బహిష్కరణకు గురిచేశారని ఏఎస్పీ ఎదుట వాపోయారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని, వారి ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ మాదిగపల్లె వాసులకు వివరించారు. కార్యక్రమంలో సీఐ రాజా, ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నేతలు వెలగచెర్ల శివయ్య, చేమూరి వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

విపత్తు సమయంలో అప్రమత్తంగా ఉండాలి



మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

ఓబులవారిపల్లె : అగ్ని ప్రమాదాలు తదితర విపత్తు సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మంగంపేట ఏపీఎండీసీలో జిల్లా అగ్నిమాపక సిబ్బంది సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏ విధంగా జాగ్రత్తలు పాటించాలన్న విషయంపై అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ ద్వారా ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ సుదర్శన్ రెడ్డి, తహసీల్దార్ శ్రీధర్ రావు, మైన్స్ మేనేజర్ గోపీనాథ్, ఎస్ఐ పి.మహేష్, స్పెషల్ ఫోర్స్ ఎస్ఐ శివ, ఏపీఎండీసీ, త్రివేణి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక ప్రపంచానికి మూల స్తంభం మెకానికల్ రంగం

డీఆర్‌డీఓ శాస్త్రవేత్త రామ్ ప్రభు



విద్యార్థుల ప్రాజెక్ట్ బుక్స్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రామ్ ప్రభు

కురబలకోట : మారుతున్న ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం ఎన్ని మార్పులు చెందినా మెకానికల్ ఇంజినీర్ల అవసరం ఎప్పుడూ ఉంటుందని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) బెంగళూరు శాస్త్రవేత్త డాక్టర్ రామ్ ప్రభు అన్నారు. బుధవారం అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సింపోజియం మెకోనన్స్–25 ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సాంకేతిక ప్రపంచానికి మెకానికల్ రంగం మూల స్తంభంగా నిలుస్తోందన్నారు. ఉత్పత్తి నుంచి అంతరిక్ష పరిశోధన వరకు వినూత్న ఆవిష్కరణలకు అవకాశాలు ఉన్నాయన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మంది విద్యార్థులు టెక్నికల్ పేపర్ ప్రజెంటేషన్, క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఆటో క్యాడ్ డ్రాయింగ్ తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి దుర్మరణం



మృతి చెందిన ఉదయ్‌కుమార్

కురబలకోట : మండలంలోని అంగళ్లు–సీటీఎం మార్గంలోని మంత్రాలయం వద్ద బుధవారం రాత్రి ట్రాక్టర్ ఢీకొనడంతో యువకుడు దుర్మరణం చెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు..మండలంలోని అంగళ్లు దగ్గరున్న కనసానివారిపల్లె కాలనీకి చెందిన ఉదయ్‌కుమార్ (25) ఇంజినీరింగ్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. బుధవారం రాత్రి మరో ఇద్దరు స్నేహితులతో కలసి సీటీఎం నుంచి స్వగ్రామానికి మోటార్ సైకిల్‌పై వస్తుండగా మంత్రాలయం వద్ద ట్రాక్టర్ ఢీకొంది. విష్ణు వర్ధన్ అక్కడికక్కడే మృతి చెందగా వెంట ఉన్న ఇద్దరు గాయపడ్డారు. మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కనసానివారిపల్లెకు చెందిన వెంకటేష్, అంగళ్లు గ్రామానికి చెందిన బాబా పకృద్దీన్ గాయపడిన వారిలో ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వెంటాడిన మృత్యువు

- రెండు మోటార్ సైకిళ్లు ఢీ
- కింద పడిన విద్యార్థిపై ట్రాక్టర్ దూసుకెళ్లడంతో మృతి
- కన్నవారు, స్నేహితుల కన్నీరు మున్నీరు



గాయపడిన శశిధర్



వెంకటరమణ (ఫైల్)



వెంకటరమణ మృతదేహం వద్ద విలపిస్తున్న స్నేహితులు

కురబలకోట : రెండు మోటార్ సైకిళ్లు ప్రమాదవశాత్తు ఢీకొనగా ఓ విద్యార్థి రోడ్డుపై పడిపోవడం.. అప్పుడే అటుగా వేగంగా వచ్చిన ట్రాక్టర్ అతని మీదుగా దూసుకెళ్లడంతో విద్యార్థి మృతి చెందిన విషాదకర దురదృష్టకర సంఘటన కురబలకోట మండలంలోని అంగళ్లులో బుధవారం మధ్యాహ్నం జరిగింది. మరో విద్యార్థి కూడా గాయపడ్డాడు. ముదివేడు పోలీసుల కథనం మేరకు..పెద్దమండ్యం మండలం కలిచెర్ల గ్రామం శెట్టివారిపల్లెకు చెందిన జి. వెంకట్రమణ (22) కదిరి రోడ్డులోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబీఏ చదువుతున్నాడు. అంగళ్లులో హాస్టల్‌లో ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం మరో ఇద్దరు స్నేహితులతో కలసి అంగళ్లులో మోటార్ సైకిల్‌పై కళాశాల వద్దకు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో మోటార్ సైకిల్ ఢీకొన్నట్లు చెబుతున్నారు. వెంకటరమణ ఒక వైపు, అతని స్నేహితులు ఇద్దరూ మరో వైపుగా పడిపోయారు. అప్పుడే రెప్పపాటులోనే అటుగా వేగంగా వచ్చిన ట్రాక్టర్ వెంకటరమణ మీదుగా దూసుకెళ్లింది. ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మరో స్నేహితుడు నిమ్మనపల్లె మండలానికి చెందిన శశిధర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇంకొకరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన శశిధర్‌ను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి మృతితో తల్లిదండ్రుల కలలు కల్లలు కావడంతో వారి రోదన వర్ణనాతీతంగా మారింది. ఇంటి నుంచి సంతోషంగా కళాశాలకు వెళ్లిన వెంకటరమణ శవంగా మారడంతో బంధుమిత్రులు కూడా తల్లడిల్లిపోయారు. ఈ సంఘటన చూపరుల హృదయాలను కలచివేసింది. ప్రతి ఒక్కరి కళ్లు చెమర్చాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్యా యత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలు నాగమ్మ

మదనపల్లె : ఒంటరి తనాన్ని భరించలేని ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం మదనపల్లెలో జరిగింది. బాధితురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. గుర్రంకొండ మండలం, తరిగొండ పంచాయతీ, బురుజుపల్లికి చెందిన నాగమ్మ (90) ఒంటరి జీవితం గడుపుతోంది. కొద్దిరోజులుగా ఒంటరి జీవితం పై విరక్తితో బాధపడుతూ ఉండేది. ఈ క్రమంలో రెండు రోజులక్రితం మదనపల్లెలోని బంధువుల ఇంటికి వచ్చింది. తిరిగి బుధవారం తిరుగు ప్రయాణమై ఆటో ఎక్కింది. మార్గమధ్యంలోని తట్టివారిపల్లి చెరువు వద్ద దిగి, కొద్దిసేపు అటు ఇటు చూసి ఎవరూ రాని సమయంలో నీళ్లలోకి దూకేసింది. ఇంతలో గమనించిన స్థానికులు ఆమెను బయటికి తీసి బాధితురాలిని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చెట్లు నరికివేత

బి.కొత్తకోట : మండలంలోని గుమ్మసముద్రం వద్ద పొలంలోని 12 కొబ్బరి చెట్లను నరికివేశారని బాధితులు చేసిన ఫిర్యాదుపై బుధవారం కేసు నమోదు చేసినట్లు సీఐ జీవన్ గంగనాథ్‌బాబు తెలిపారు. ఈశ్వరమ్మ, ఈశ్వరప్ప దంపతులకు గుమ్మసముద్రం ఆంజనేయస్వామి ఆలయం వద్ద భూమి ఉంది. గ్రామానికి చెందిన నరసింహులు, సుమ, లక్ష్మమ్మ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి 12 కొబ్బరి చెట్లను నరికివేశారని ఫిర్యాదు చేశారు.

పిడుగుపాటుతో వ్యక్తి మృతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : వల్లూరు మండలానికి చెందిన వెంకట సుబ్బన్న (30) వాటర్‌గండి వద్దగల పొలాలలో అర్ధరాత్రి పిడుగుపాటుకు గురై మృతి చెందినట్లు చిన్నచౌకు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

ఆటోను ఢీ కొన్న స్కార్పియో


ఐదుగురికి గాయాలు




ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారిపై బుధవారం రాత్రి ఆటోను స్కార్పియో ఢీ కొనడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. రాజంపేట నుంచి కోడూరుకు వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న స్కార్పియో వాహనం ఢీ కొంది. దీంతో స్కార్పియో, ఆటో డ్రైవర్లు సుబహాన్, అజయ్, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ పి. మహేష్ తెలిపారు.

జగనన్న కాలనీల పేరు మార్పుపై జనాగ్రహం



నాడు.. వైఎస్ఆర్ జగనన్న కాలనీ



నేడు.. వైఎస్ఆర్ జగనన్న కాలనీ పేరును తొలగిస్తున్న దృశ్యం

సంబేపల్లె : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు గడిచింది. ఇంతవరకు పేదల గృహ నిర్మాణాలకు ఒక్క సెంటు స్థలం కూడా మంజూరు చేయలేదు. కానీ వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన వైఎస్సార్ జగనన్న కాలనీల పేర్లను పీఎంఏవై ఎన్‌టీఆర్ నగర్‌గా మారుస్తుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో పూరిగుడిసెల స్థానంలో పక్కా ఇళ్లు నిర్మించారు. అదే స్ఫూర్తితో 2019 – 2024 కాలంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదింటి కల నెరవేర్చారు. నాటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కృషితో రాయచోటి నియోజకవర్గంలో 20 వేల పక్కాగృహాలు మంజూరయ్యాయి. ఫలితంగా 93 జగనన్న కాలనీలు నిర్మించారు. రాయచోటి పట్టణ పేద ప్రజలకోసం సంబేపల్లె మండలం నారాయణరెడ్డిపల్లె గ్రామంలో 250 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి సేకరించి 6 వేలకు పైగా పక్కాగృహాలు మంజూరు చేయించారు. భూగర్భ డ్రైనేజీ, రహదారులు, తాగునీటి సౌకర్యాలను కల్పించారు. నారాయణరెడ్డిపల్లె జగనన్న కాలనీలో దాదాపు 8 కోట్ల రూపాయలను ఖర్చు పెట్టారు. ఇందులో 33–11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, 90 ట్రాన్స్‌ఫార్మర్లు, 2000 విద్యుత్ స్తంభాలు, 1000 వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో కాలనీ ప్రాంగణమంతా కాంతిని వెదజల్లుతోంది. ఈ పరిస్థితుల్లో జగనన్న కాలనీలను పీఎంఏవై ఎన్‌టీఆర్ నగర్‌గా పేరు మార్చడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.